నేను కడతేర్చుకోడమే గాదు మిమ్మల్ని కడతేర్చగలను- నన్నింక కొడుకనుకో- కామాక్షి గబగబ అంది. కూతురి మాటలు విస్తుపోతూ విన్నాడు మాధవయ్య.

"అయితే హారతిపళ్లెం తెచ్చి నీవా పెట్టేశావు యిక్కడ?" అయోమయంగా అడిగాడు.

"అవును నాన్న- నీ వరస యివాళ నాకెందుకో అనుమానం అన్పించింది- ఇందాక అమ్మదగ్గర అలా అన్నావు- వస్తున్నప్పుడు సంచిలో ఏదో తెచ్చి అలమరలో పెట్టావు. నా కనుమానం వచ్చి చూశాను-సరిగా అప్పుడే పోస్టులో నా ఉద్యోగం ఆర్డరు వచ్చింది. 'హారతి పళ్లెం పవిత్రకార్యానికి పనికొచ్చేది నాన్నా- దానితో నన్ను ఆ నీచుడింటికి కాపురానికి పంపడం ఆ దేవుడికి ఇష్టం లేదు నాన్న" కామాక్షి శాంతంగా అంది. మాధవయ్య ఇంకా అయోమయంగానే వేణుగోపాలస్వామి వంక చూశాడు. ఎప్పటిలాగే చిరునవ్వులు చిందించాడు వేణుగోపాలస్వామి.

"నన్ను తిట్టావు చూశావా అనవసరంగా" అన్నట్టనిపించింది. ఆయనకి.

"నీ లీలలు చిత్రమైనవి తండ్రీ....నన్ను క్షమించు వేణుగోపాలా.... నీ ముందు మే మెంతవారం, నా అజ్ఞానాన్ని మన్నించు" చేతులెత్తి నమస్కారం చేసాడు మాధవయ్య. ఆయన కన్నీటిపొరలమధ్య మసక మసకగా కన్పించాడు వేణుగోపాలస్వామి నవ్వుతూ.

★

(స్వాతి సౌజన్యంతో)

# తలుపు గొళ్ళెం

ఆరోజు శోభ శోభనం! రాత్రి పదిగంట లయింది- అమ్మలక్క లందరూ హాస్యాలాడుతూ శోభని గదిలోవదిలి పైన తలుపు గొళ్ళెం పెట్టేశారు.

తలుపు గొళ్ళెం పెట్టగానే-సావిట్లో మంచమ్మీద పడుకున్న శావమ్మగారి గుండెల్లో రాయిపడ్డట్టయింది. బితుకు బితుకుమంటూ తలుపు గొళ్ళెంవంక చూసింది. "అమ్మా శోభా-నాతల్లీ! నే నేంచేతునే తల్లీ"-అనుకుంది బాధగా. రాత్రి శోభ తెల్ల

చీర కట్టుకుని, సన్నజాజులు తురుముకుని ముస్తాబవుతుంటే గదిలోకి వెళ్ళ- "అమ్మడూ భయం వేస్తుందా తల్లీ?" జాలిగా తలనిమిరి అడిగింది. మామ్మ అంటున్నదీ అర్థంకాక తెల్లబోయి చూసింది. "అదేనమ్మడూ, రాత్రి గదిలోకి వెళ్ళాలంటే బెంగగా వుందా?" శోభ సిగ్గులమొగ్గ అయి తలదించుకుంది. కావమ్మగారు రహస్యంగా బుజ్జగిస్తున్నట్టు "పరవాలేదులే తల్లీ" నేను సావిట్లోనే వుంటాగా, అందరూ వెళ్ళాక తలుపు గొళ్ళెం తీసివుంచుతాలే' అంది. శోభ మరింత తెల్లబోతూ చూసింది. "పిచ్చితల్లీ! ఎలా చెప్పనే, ఎంత వెర్రిమాలోకానివే తల్లీ!" మనవరాలు పులినోట్లో తల పెట్టబోతున్నట్టు తల్లడిల్లి పోతూ ఎలా చెప్పాలో అర్థంకాక తికమక పడుతుండగా కోడలు గదిలోకి రావడంతో మెల్లగా గదిలోంచి వెళ్ళిపోయిందావిడ.

అరవై ఏళ్ళు దాటినకావమ్మగారికి తలుపు గొళ్ళెం చూస్తే చచ్చే భయం. ఏభై ఏళ్ళక్రితం-మొదటిసారి ఆవిడ పన్నెండోఏట-రజస్వల అయి స్నానం అయిన నాలుగో నాడు ఆ పెద్ద యినపగొళ్ళెం వున్న గదిలోకి అమ్మలక్క లందరూ తోసి గొళ్ళెం బిగించారు. ఆ గదిలో యింతెత్తు, అంతలావు-యింతింత ఎర్రకళ్ళు, అంతంత మీసాలతో-అర్నెల్ల నాడు పెళ్ళి పీటలమీద, పల్లకీలో కలిసి కూర్చున్న ముప్పైఏళ్ళ ఆ ఆంబోతులాటి మనిషి-ఆడదానికోసం వాచిపోయినట్లు ఆరాటంగా ఎదురుచూస్తూ రాక్షసుడిలా గదిలోకి రాగానే ఆ పసిపిల్లని ఆ ముక్కు పచ్చలారని, వంటితడి ఆరని ఆ పసిపిల్లని అమానుషంగా, క్రూరంగా నలిపి నలిపి రాత్రంతా అనుభవించాడు. గువ్వపిట్టలా గజగజ వణికిపోతూ, పిల్లి నోట చిక్కిన పిచ్చికపిల్లలా గిలగిల కొట్టుకుంటూ ఏడుస్తున్న ఆ పిల్ల నోరునొక్కి, ఏడిస్తే చంపేస్తానని బెదిరించీ తన అవసరం యిష్టం వచ్చినంతసేపు తీర్చుకుని అలిసి సొమ్మసిల్లే ఆంబోతులా గుర్రు పెట్టి నిద్రపోయాక ఆ పిల్ల గట్టిగా ఏడవడానికి భయపడి వెక్కిపడుతూ ఆ గదిలోంచి పారిపోవడానికి దారులు వెతికింది. రాక్షసిలాంటి యినప గొళ్ళెం-అదీ ఆమెకి అందనంత ఎత్తున-దిగాలుపడి ఏడుస్తూనే దీపం పెట్టిన ముక్కాలిపీట ఎత్తి తలుపు దగ్గిర వేసుకుని, తుప్పుపట్టి ఊడిరాని ఆ యినప గొలుసుల గొళ్ళాన్ని అతికష్టం మీద తీసి, అదృష్టవశాన అర్ధరాత్రి అవతలవైపు గొళ్ళెం ఆమె తల్లి తీసివుంచడం వల్ల- తలుపుతీసి పరుగున వెళ్ళి అమ్మా అంటూ తల్లిపక్కలో భోరుమంటూ ఏడుస్తూ దూరిపోయింది— 'అయ్యయ్యో-తప్పమ్మా, అలా రాకూడదమ్మా-అల్లుడిగారికి కోపం వస్తుంది. ఏం చేసినా ఓర్చుకోవాలి తల్లీ-' అంటూ ఆ తల్లి భయపడ్తూ కూతుర్ని- తప్పమ్మా అంటు ఏడుస్తున్న ఆ పసిదాన్ని-నిర్దాక్షిణ్యంగా బలిపశువుని యీడ్చుకెళ్లినట్టు, రెక్కపట్టి లాక్కెళ్లి ఆ గదిలోతోసి బయటగొళ్లెం పెట్టేసింది-తెల్లవారు ఝామున ఆ పతిదేవుడు మేల్కొని మళ్ళీ ఓసారి ఏడ్పి ఏడ్పి కటికనేలని అప్పుడే కనుమూసిన ఆ పసిపిల్లని, అప్పటికి వళ్ళెరగకుండా జ్వరం వచ్చిన ఆ అమ్మాయిని

పూర్తిగా ఆరోజుకి పిప్పిచేసి వదిలాడు. ఆ పిల్ల స్మృతి కోల్పోయిన సంగతన్నా గుర్తించలేదు ఆ రాక్షసుడు—రెండోరోజు నూటమూడు జ్వరం వున్న పిల్లని గదిలోకి పంపమంటే అలిగి వెళ్ళిపోవడానికి అల్లుడుగారు, తయారైతే మామ, అత్త కాళ్ళావేళ్ళాపడి ఆ జ్వరం వున్నపిల్లనే గదిలోకి పంపడం-రెండోరోజు ఏమయిందీ కూడా గుర్తించలేని మగతలో వుండిపోయింది ఆమె-తరువాత ఆమె కాపురం చేసిన మూడేళ్ళల్లో మొదటిరోజు అనుభవంకంటె మృదు మధురమైన అనుభవం ఆవిడకి కల్గలేదు-మొగుడంటే రాక్షసుడే! తలుపుగొళ్ళెం పెడితే గుండె అదిరేది. దగ్గరకు వస్తూంటే వళ్ళువణికేది-పెదాలు బిగపట్టి ఘోరం చూడలేనన్నట్టు కళ్లు మూసుకుని ముక్కకుండా, మూల్గకుండా మూల్గితే తన్నులు తినాలని ఊపిరి బిగపట్టి వళ్ళప్పగించి భర్తగారు వదిలేవరకు క్షణం ఒక యుగంలా నరకం చూసి ఆయన వదలగానే తలుపుగొళ్ళెం తీసుకుని ఒక్క ఉదుటన బయటికి వచ్చిపడి ఊపిరి పీల్చుకుని ఆ పూట గడిచిపోయినందుకు వెయ్యి దండాలు పెట్టుకునేది ఆమె- భర్త, దాంపత్యం అంటే ఆమెకి తెల్సిందదే. అంతకంటె ఎక్కువతెలిసే అవకాశం యీయకుండానే పదిహేనో ఏటే విధవనిచేసి వెళ్ళిపోయాడు. ఆభర్త తనకి గుర్తుగా ఓ కొడుకుని అందించి-కాముడు, కావమ్మ, కావమ్మగారిగా అంచెలంచల మీద మారి ఆవిడ కొడుకుని పెంచుకుంటూ వాడితోనే కాలం వెళ్ళబుచ్చేది. పోయిన మొగుడు పోతే పోయాడు-సామెత మాదిరి-మొగుడుపోయి యింక ఆ బాధవుండనందుకు లోలోపల సంతోషమే కల్గిందీ ఆవిడకి-లోకంలో ఆడబతుకుపట్ల ఆవిడకి జాలి. మొగుళ్ళతో కాపురం చేసుకుంటున్న ఆడవాళ్ళని చూసి పాపం అని జాలిపడేది. ఏ ఆడపిల్లకన్నా శోభనం అంటే ఆవిడ గుండెల్లో ఏదో గుబులుపుట్టేది. ఉరికంబం ఎక్కబోయే వాళ్ళమీద జాలిపడేట్టు జాలిగా చూసేది. ఆవిడ కొడుకు పెరిగి పెద్దయి పెళ్ళి జరిగిన నాడు కొడుకు శోభనం రోజు—ఆవిడకి కోడలిమీద ఎక్కడలేని దయ పుట్టుకొచ్చింది. కొత్త పెళ్ళికూతురు—ఆ పిల్లతో ఏమన్నా చెపితే వాళ్ళవాళ్ళేం అనుకుంటారోనని గదిలోకి పంపేముందు కొడుకుని చాటుగా పిలిచి-"వరేయ్‌బాబూ-చిన్నపిల్ల జాగ్రత్త ....పాపం.... భయపడ్తుందేమో...." ఈ చాదస్తం ఏమిటన్నట్టు కొడుకు తల్లి వంక చూసి- "తెలుసులే" అన్నాడు. పూర్తిగా వినకుండానే-యింకేం చెప్పాలో తెలియక కావమ్మగారు నోరుమూసుకుంది....ఆ రాత్రంతా ఆవిడకి కంటిమీద కునుకులేదు, సావిట్లో పడుకుని మాటిమాటికి తలుపువంక చూస్తూ, లోపల్నించి ఏడుపు వినవస్తుందేమో కోడలు పిలుస్తుందేమోనన్నట్టు చెవులు ఒగ్గి, మూతలుపడిపోయే కళ్ళని బలవంతాన విప్పుకొని రాత్రంతా జాగరం చేసింది. ఆవిడనుకున్నట్టు గదిలోంచి ఏడుపులు వినపడలేదుగాని, గుసగుసలు విన్పించాయి. చిన్నగా నవ్వులు, గాజుల గలగలలు. విన్పించాయి. ఆవిడకి నమ్మశక్యంకాక నెమ్మదిగా తలుపు సందులోంచి

చూసింది. ఒకరి కౌగిలిలో ఒకరు నవ్వుకుంటూ గుసగుసలాడు కుంటున్న కొడుకు కోడల్ని నమ్మలేనట్టు చూసింది. ఆవిడ మనసెందుకో ముల్లుగుచ్చుకున్నట్లయింది. శోభనం నాడు యిలా నవ్వుకోటం, ఊసులాడుకోడం, కనివిని ఎరగని వింతలా విడ్డూరం అన్పించింది. తెల్లారి కోడలు గదిలోంచి రాగానే మొహంలోకి పట్టిపట్టి చూసింది. ఏడుపు ఛాయలు లేకపోగా సిగ్గుతో ముసిముసినవ్వులు నవ్వుకుంటున్న కోడలిని చూసేసరికి ఆవిడకి ఏదో మంటకల్గింది. కోడలు కాపురంకి వచ్చిందగ్గిర నించి కొడుకు కోడలు సందుదొరికితే గదిలో దూరటం గుసగుసలు, నవ్వులు, సాయంత్రం అయ్యేసరికి తెల్ల చీర కట్టుకుని ముస్తాబయ్యే కోడలిని చూస్తే ఆవిడకి తిక్క రేగింది. కోడలు గనక తనలా భయపడి ఏడిచివుంటే ఆవిడ కోడలిని నెత్తిన పెట్టుకుని జాలి సానుభూతి చూపి కడుపున పెట్టుకునేది-ఆవిడ జాలి, సానుభూతి ఎవరికీ అక్కరలేకపోవడంతో-తనకి దక్కని సుఖం కోడలికి దక్కినందుకు ఏదో, అసూయ ద్వేషం పెరిగాయి ఆవిడలో అదిమొదలు కోడలుని సాధించడం, దెప్పడం, పిల్లి మీద, ఎలకమీద పెట్టి తిట్టడం, పట్టపగలే యింత బరితెగించి మొగుడితో అత్తముందని వున్నానన్నైనా లేకుండా సరసాలా-అవ్వ-కలికాలం అంటూ మెటికలు విరిచేది. కోడలు కొత్తలో వూరుకున్నా తర్వాత ఎదురు తిరిగి జవాబులు యిచ్చేది. అత్తాకోడళ్ళమధ్య కొడుకు నలిగేవాడు. "చూడు మా అమ్మ కాపురం చేసింది మూడేళ్ళు-మా నాన్న రాక్షసుడిలా ఆవిడని కాల్చుకు తిని మొగుడు, సంసార సుఖం అంటే భయపడేలాచేసి వదిలాడు ఆవిడ్ని-నీవు తనలాకాక సంతోషంగా వున్నావని తనకు దక్కనిది నీ వనుభవిస్తున్నావని ఆవిడ అసూయ-పాపం ఏం సుఖపడింది ఆవిడ జీవితంలో, ఆవిడ కోరికలేం తీరలేదు. అసలలాంటి కోరిక లుంటాయని యిప్పుడే తెల్సుకుంది గనక ఎవరిమీద చూపలేని కోపం నీమీద చూపిస్తుంది. కాస్త ఆవిడ బాధ అర్థం చేసికుని ఏమన్నా మాట్లాడక వూరుకో-అంటూ ఓరోజు పెళ్ళానికి సర్ది చెప్పాడు. అప్పటినించి కోడలు కావమ్మగారి సాధింపు వినీ విననట్లూరుకునేది.

మనవరాలు శోభ పుట్టాక కావమ్మగారు కాస్తమారి మనవరాలి ముద్దు ముచ్చట్లతో కాలక్షేపం చేస్తూ కోడలిని సాధించడం మానేసింది. పిల్లలందరిలో శోభ అంటే ఆవిడకి ముద్దు-ఆ శోభ పెద్దదయి-పెళ్ళయ్యాక—

ఆ శోభకి-శోభనం అంటే కావమ్మగారికి దిగులు, బెంగ పట్టుకున్నాయి. తన కొడుకంటె మంచివాడు గనక, తను చెప్పింది గనక కోడలిని కష్టపెట్టలేదు. యిప్పుడీ శోభ మొగుడు ఎలాంటివాడో! తన మనవరాలిని ఏం చేస్తాడో-మొదటిరోజు గుర్తు వచ్చి ఆవిడ భయంతో వణికిపోయింది. అయినా నిస్సహాయంగా రాత్రంతా సావిట్లో మంచంమీద కళ్ళల్లో వత్తులు వేసుకుని కూర్చుంది-కాని కొడుకు కోడలిని మించి రాత్రంతా యిద్దరూ ఒకటే నవ్వులు, మాటలు, కిలకిలలు విని ఒకవిధంగా సంతృప్తి

పడినా-యీ లోకంలో మొదటిరాత్రి అనుభవం తనకొక్కర్తెకే దక్కినందుకు మొదటిసారిగా బాధపడింది.

మూడు రాత్రులు శోభ మిగతా ప్రపంచాన్ని మరిచిపోయినట్టు గది తలుపులు గొళ్లెం పెట్టుకుని మొగుడితోటిదే లోకం అన్నట్టు ప్రవర్తించడం చూసి విస్తు పోయింది. కావమ్మగారు చటుక్కున రావడం ఏ కాఫీయో, టిఫినో, నీళ్లో పట్టుకెళ్ళ డం మళ్ళీ గొళ్ళెం పెట్టేసుకోవడం-అక్కడనించి ఒకటే వికవికలు, పకపకలు-చూసి చూసి వారంరోజులు పోయాక మొగుడు వెళ్ళాక శోభని దగ్గిరలాక్కుని కూర్చో పెట్టుకుని అన్నాళ్ళుగా, అన్నేళ్ళుగా ఆవిడ మనసులో కదలాడే సందేహా లన్నీ బయటపెట్టింది. పన్నెండేండ్లదానిలో తన మొదటి రాత్రి అనుభవం, మొదటి రాత్రే కాదు మూడేళ్ళ రాత్రుల అనుభవం అనుభూతి చెప్పింది- 'అమ్మడూ మొదటి రోజు నీకు భయం వేయలేదే తల్లీ-అలా నవ్వుకుంటున్నారు. అతను....అతను నిన్నేంచెయ్యలేదా-బాధకల్గ లేదా ఏమోతల్లీ ఇప్పటికీ నాకారోజు తలుచుకున్నా-ఆ రోజేకాదు ఏ తలుపు గొళ్ళెం చూసినా గుండెదడే అమ్మా, యిన్నాళ్ళయినా ఆ దడ తగ్గలేదే—రాకాసిలాంటి ఇంతింత గొలుసుల గొళ్ళెంతో నన్ను బంధించిన ఆ గొళ్లెం చూస్తే.... అమాయకంగా చెప్పతున్న మామ్మని జాలిగా, సానుభూతిగా చూసి నవ్వింది శోభ.

'మై డియర్ మామ్మా-తలుపు గొళ్లెం కేవలం మనుష్యులని బంధించేదిగా మాత్రమే నీకు తెల్సు, కాని మనసులని బంధించడానికీ ఉపయోగిస్తుంది మామ్మా-ఐ పిటీ యు....' అంది యింకేం చెప్పలేక.

★

# గుర్రపు కళ్ళెం

రాజాధిరాజ....రాజమార్తాండతేజ... వంధి మాగధులు స్తోత్రంచేసే రాజాధి రాజు కాకపోయినా రంగాపురం జమిందారు రాజా రావుబహద్దూర్ రంగరాజుగారి దివాణం—రాణివాసంతో, దాసదాసీ జనంతో, విందులు, విలాసాలు, నాట్యాలు, అతిథి అభ్యాగతులతో కళకళలాడేది—ఆయనగారి ముఖ్య హాబీ గుర్రపు స్వారి.